క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్క నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మంగళవారం 119వ వార్డులో శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నా క్యాంటీన్‌లను పరిశీలించారు. ప్లేట్ల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిని కమిషనర్ పరిశీలించారు.

బావూజీపేటలో నీటి సమస్య



మున్సిపల్ ఎంఈఈకి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు బావూజీపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఫిల్టర్ చేసిన నీటిని కుళాయిలకు సక్రమంగా సరఫరా చేయడంలో వాటర్ సెక్షన్ సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్లనే నీటి సమస్య ఏర్పడుతోందని 2వ వార్డు కౌన్సిలర్ సురేష్ మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎంఈఈ) చలపతిరావుకు ఫిర్యాదు చేశారు. నీటి సమస్య లేకుండా చూడాలని విన్నవించారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వర్లు

కోసిగి: కోసిగి మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా పి. వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అవుకు మండలంలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీపీ ఈరన్నను మర్యాద పూర్వకంగా కలిశారు.

కొత్త బస్సుల ప్రారంభం



కొత్త బస్సు వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోకు కొత్తగా మంజూరైన నాలుగు బస్సులను మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఓ బస్సును స్వయంగా నడిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితుడితో మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది

మంత్రాలయం : కర్ణాటక ఆర్టీసీ బస్సులో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ వై. విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చిన కర్ణాటక బస్సులో పెద్దకడబూరు మండలం హులికన్వి గ్రామానికి చెందిన మస్కి లక్ష్మన్న అనే వ్యక్తి రెండు స్కూల్ బ్యాగులలో తీసుకెళ్తున్న 480 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీలో పీసీలు సోమశేఖర్, వీరాంజినేయులు ఉన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు




కంపోస్ట్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో తడి, పొడి చెత్త సేకరణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. చెత్తను కంపోస్ట్ యార్డ్‌లో సక్రమంగా డంపింగ్ చేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సోగనూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించారు. పట్టణంలో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రాజు నాయక్, ఏఈ మదన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమయ్యేనా?

- జగనన్న కాలనీల్లో ముందుకు సాగని పక్కా గృహాల నిర్మాణాలు
- ప్రభుత్వం మారడంతో ఆగిపోయిన పనులు
- వందరోజుల్లో పూర్తి చేస్తామన్న కూటమి ప్రభుత్వం
- ఆ దిశగా చర్యలు చేపట్టని వైనం



ఆదోని జగనన్న కాలనీలో రూఫ్‌లెవెల్‌లో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

ఆదోని సెంట్రల్: ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకరం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి, నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వం నిర్మాణ పనులను పరుగులెత్తించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం వందరోజుల ప్రణాళికలను సిద్ధం చేసి అక్టోబర్ 2వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పనులు మాత్రం జరగడం లేదు. ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినా కదలిక లేదు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అవుతాయో లేదో అని లబ్ధిదారుల్లో సందేహం కలుగుతోంది.

ముందుకు సాగని పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆదోని పట్టణం జగనన్న కాలనీలోని 3 లేఅవుట్లలో 17.81 ఎకరాలలో 9,327 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మొదటి విడతగా 5,101 ఇళ్లు మంజూరయ్యాయి. థర్డ్‌పార్టీ ద్వారా ద్వారా ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా.. ఇందులో ఇప్పటి వరకు 1,402 ఇళ్లకు టాప్ వేయగా, 690 రూఫ్ లేవల్‌లో, 142 ఇళ్లు లెంటల్ లేవల్‌లో ఉన్నాయి. 2,051 ఇళ్ల ప్లింత్‌బీమ్ దశలో, 816 నిర్మాణాలు బేస్ మట్టంలెవల్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రగతిని లక్ష్యంగా చేసుకుని టాప్ లేవల్ పూర్తి అయిన 1,402 ఇండ్లను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా సాగిన ఇళ్ల నిర్మాణ పనులు, ప్రభుత్వ మారడంతో కాంట్రాక్టర్ నిర్మాణాలను నిలిపివేశాడు. కూటమి ప్రభుత్వం నిర్మాణాలను కొనసాగించేందుకు చొరవ తీసుకోకపోవడం, కాంట్రాక్టర్‌కు సహకరించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు

పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగ కూడదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాగు నీరు, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. కాలనీలో పార్కు, దేవాలయం, బడి వంటివి ఏర్పాటుకు స్థలాలను కూడా కేటాయించింది. కాలనీలలో నివసించే ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో పనులను చేపట్టింది. కాలనీలో తాగునీటి వసతి కోసం రూ.7.69 కోట్లు ఖర్చు చేసి పైపులైన్లు వేసి మినీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. అంతర్గత రహదారుల నిర్మాణం కోసం రూ.11.93 కోట్లు ఖర్చు చేసి రహదారులను ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్లతో 11/33 కేవి సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టింది. కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. వీధి వీధికి ఒక మినీ 160కేవీ ట్రాన్స్‌ఫారమ్ కూడా ఏర్పాటు చేశారు. కాలనీలో విద్యుత్ సమస్య తలెత్తకుండ ఉండేవిధంగా పనులను చేపట్టారు. అయితే రోడ్డు, ట్యాంకుల నిర్మాణాలు కూడా మధ్యలోనే ఆగిపోయాయి

"త్వరలో పనులను చేపడతాం



ఇళ్ల నిర్మాణ పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా త్వరగా చేపడుతాం. మొదటగా రూఫ్ లెవల్ పూర్తి చేసుకున్న ఇళ్లను డిసెంబర్ 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మిగిలిన ఇళ్లను మార్చి నాటికి పూర్తి చేయాలని అధికారులు సూచించారు. వర్షాలు కురవడంతో పనులు చేయడానికి కొన్ని ఆటంకాలు ఏర్పాడ్డాయి. వర్షాలు తగ్గు ముఖం పడితేనే పనులను ప్రారంభిస్తాం. ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు తగు చర్యలు చేపడుతున్నాం.

– యం. రవికుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ.

పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి

గోనెగండ్ల : చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సీఐ గంగాధర్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పిల్లలు ఇటీవల సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోవడం, పొలాల దగ్గర క్రిమి సంహారక మందులు తాగి చనిపోవడం లాంటి ఘటనలు చూస్తూనే ఉన్నామన్నారు. దసరా సెలవులు ఉన్నందున పిల్లలు కాలువలు, చెరువులకు వెళ్లి వాటిలో సరదాగా ఈత కొడుతూ ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. కాబట్టి తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. అలాగే చిన్నపిల్లలకు బైకులు ఇవ్వకూడదని, చెడు స్నేహాలు, చెడు తిరుగుళ్లకు వెళ్లకుండా, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

10న ఆధార్ రెన్యూవల్ శిబిరం

ఎమ్మిగనూరుటౌన్: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఈనెల 10న ఆధార్ రెన్యూవల్ కార్యక్రమం చేపట్టనున్నట్లు స్థానిక పోస్ట్ మాస్టర్ స్వామి నాయక్ మంగళవారం తెలిపారు. ఆధార్ నమోదై 10 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్‌తో పాటు మొబైల్ లింక్ అప్‌డేట్ కూడా చేసుకోవచ్చన్నారు.

పంట పొలాల పరిశీలన



పొలం పిలుస్తోందిలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఓ వేదామణి, కేవీకే బనవాసి శాస్త్ర వేత్తలు

కోసిగి: మండలంలోని పల్లెపాడు, చింతకుంట, కోసిగి గ్రామాల్లోని పంట పొలాలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వేదామణి, కేవీకే బనవాసి శాస్త్రవేత్తలు డాక్టర్ మౌనిక, శ్రీచందనలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు. మంగళవారం ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారి రాజు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంలో అయా గ్రామాల్లో రైతులతో గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. పత్తి, మిరప, ఉల్లి పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మిరపలో తెల్లదోమ ఆశించడం గమనించారు. దీని నివారణకు ఎకరాకు నీలి రంగు, పసుపు రంగు అట్టలు 20 పెట్టుకోవాలని సూచించారు. రసం పీల్చుపురుగుల నివారణకు ఇథియోపెన్ ప్రాక్స్, డయాఫెంథియోరాన్ ఒక గ్రాము.. లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లిగడ్డలో తెగుళ్ల నివారణకు మాంకోజెబ్, కార్బండిజమ్ 2 గ్రాములు 1లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే గ్రామ సభ నిర్వహించి ప్రతి రైతు తప్పక పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ రవీంద్ర, శేఖర్, రాజశేఖర్, పవిత్ర పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నందవరం: మండల కేంద్రం నందవరంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ఎంపీఓ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజ మంగళవారం తెలిపారు. అవుట్ సోర్సింగ్ విధానంలో 4 నాన్ టీచింగ్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కేజీబీవీలో హెడ్ కుక్, స్కావెంజర్, స్వీపర్, డే అండ్ నైట్ వాచ్ మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇందులో హెడ్‌కుక్, స్కావెంజర్, స్వీపర్‌కు ఎటువంటి విద్యార్హత లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని, డే అండ్ నైట్ వాచ్ మెన్‌కు మాత్రం ఏడవ తరగతి ఉతీర్ణులై ఉండాలన్నారు. పైన తెలిపిన పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. 01-07-2024 నాటికి ఓసీ మహిళలకు 42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు 47 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అర్హులైన మహిళలు ఈ నెల 15వ తేదీ లోపు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని వివరించారు. మరిన్ని వివరాలకు ఎంఆర్సీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దేవబెట్ట గ్రామాన్ని సందర్శించిన తహసీల్దార్



గ్రామంలో కొండ వద్ద తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలు, భూమలను మంగళవారం తహసీల్దార్ శేషఫణి పరిశీలించారు. గ్రామంలోని స్థలాలపై రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్థలాల ఆక్రమణపై సర్పంచ్ ఫిర్యాదు చేయడం, మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన తహసీల్దార్ గ్రామాన్ని సందర్శించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టా భూముల వరకు మీరు పనులు చేసుకుంటే పర్వాలేదని, ప్రభుత్వ భూములను కలుపుకోవాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వో జ్యోతి, సర్వేయర్ వాసవి తదితరులు ఉన్నారు.

ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి




పెద్దతుంబళంలో మెడికల్ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

ఆదోని రూరల్: ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలను పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు తిక్కప్ప, ఆశావర్కర్ యూనియన్ మండల కార్యదర్శి రాజేశ్వరి, లావణ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం గ్రామాల్లోని పీహెచ్‌సీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలని ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన ప్రభుత్వం ఏపీ ఆశావర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధివర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీఓలు, సర్క్యులర్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అయ్యన్న, ఆశావర్కర్లు పార్వతి, సుకన్య, నరసమ్మ, శివలీల తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లపై పని భారం తగ్గించాలని సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో, హాలహర్వి పీహెచ్‌సీలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డాక్టర్లు శ్రీలేఖ, పరిమళ, విజయభారతిలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు రామేశ్వరి, చిట్టెమ్మ, నాగమణి, భూ లక్ష్మీ, లలిత, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి



ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని వివరిస్తున్న వైద్యాధికారులు

పెద్దకడబూరు: ఆశా కార్యకర్తలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, ఎంటమాలజిస్ట్ వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశానికి వారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విటమిన్ - ఏ ద్రావణాన్ని, ఐరన్ సిరప్‌ను అర్హులైన బాలింతలకు, బాలికలకు క్రమం తప్పకుండా వేసి ఎప్పటికప్పుడు ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దౌస్, పీహెచ్ఎన్ సుశీల, ఎంపీహెచ్ఈఓ శ్రీధర్, సూపర్‌వైజర్లు కిషోర్‌కుమార్, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతున్నందున మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ జీ.వీరచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేసంలో మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీన జరిగే మంత్రి మండలి సమావేశంలో దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీలపై ఎలాంటి చర్చలు జరగకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.




ఎమ్మిగనూరు: ధనలక్ష్మి అలంకరణలో..



ఉలన్ దారం అలంకరణలో లక్ష్మమ్మవ్వ



దొడ్డిమేకలలో సరస్వతి దేవిగా పార్వతిదేవి



ఆదోనిలో రుద్రాక్షల అలంకారంలో వీరభద్రేశ్వరస్వామి



పరమేశ్వరుడికి అన్నం వడిస్తున్న పార్వతీదేవి



నెట్టెకల్‌లో మహాలక్ష్మీదేవిగా ..

కటాక్షించు మహాలక్ష్మీ



మహాలక్ష్మిగా దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



కాత్యాయని దేవిగా అమ్మవారు



మహాలక్ష్మీ దేవిగా



ధనలక్ష్మి అవతారంలో ఆదోని గంగాభవానీదేవి

సాక్షినెట్‌వర్క్: నవరాత్రి ఉత్సవాల్లో భాంగా ఆరో రోజు మంగళవారం అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంత్రాలయం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కొలువుతీరిన దుర్గామాత అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రూ.4లక్షలు విలువ చేసే రూ.10, రూ.20, రూ.100, రూ.200 నోట్లతో అమ్మవారికి అలంకరణ చేశారు. అలాగే ఆదోనిలోని ఫారెస్ట్ అంబాభవానీమాత, ఎమ్మిగనూరు రోడ్డులోని గంగాభవానీదేవి, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, ఎమ్మిగనూరు శ్రీరామలింగేశ్వర చౌడేశ్వరి ఆలయంలో ధనలక్ష్మీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆదోని ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వను ఉలన్ దారాలతో అలంకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని రాంజల వద్ద పంపుహౌస్ మెయింటినెన్స్ పనుల వల్ల బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాంజల ప్రాంతం, అరుంజ్యోతినగర్, ఎన్‌జీఓస్, ఎల్‌బీజీ, ఎంబీజీ కాలనీలు, కునిమొల్లా, బార్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

10న సంఘీభావ ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం జరిగే వరకు ఆమెకు సంఘీభావంగా అన్ని దళిత, ప్రజా సంఘాలు పోరాటం సాగిస్తాయని పలు దళిత ,ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఆమె నిరాహార దీక్ష చేస్తున్నా అధికారులు న్యాయం చేయడం లేదని, ఇందుకు ఈనెల 10న పట్టణంలో వెయ్యి మందితో సంఘీభావ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ వర్గాల చేతిలో దాడికి గురైన గోవిందమ్మ పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో చేస్తున్న దీక్షకు లక్ష్మీనారాయణ, రామతీర్థం అమరేష్, రంగయ్య, మాల నరసన్న, నరసప్ప, గడ్డం నాగేంద్ర తదితరులు సంఘీభావం మంగళవారం తెలిపారు. అనంతరం ర్యాలీకి అనుమతి కోరుతూ పట్టణ సీఐ సుదర్శనరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు బతుకమ్మ, ఈరన్న, గడ్డం ఉసేని, సుమాల చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డా.కె.రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: రబీ పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.రామకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.కె.రాఘవేంద్రచౌదరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రబీ పంటల సాగుపై రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రబీ పంటలైన పప్పుశనగ, జొన్న, ఆముద పంటలు సాగు చేసుకుంటే సస్యరక్షణ పద్ధతులు తప్పక పాటించాలని చెప్పారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు పప్పు శనగ వేసుకోవటానికి అనుకూలమన్నారు. పప్పు శనగలో ఎన్‌బీఈజీ 2452, ఎన్‌బీఈజీ776, ఎన్‌బీఈజీ857 రకాలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. అలాగే ఆముదంలో ఐసీహెచ్-5, జెసీహెచ్-66 అనువైన హైబ్రీడ్ రకాలు వేసుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. శిక్షణలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శిధర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్



గంజిహళ్లి సమీపంలో పంట నమోదును పరిశీలిస్తున్న జేసీ నవ్య

ఎమ్మిగనూరురూరల్/టౌన్: రైతులు తమ పంటలకు ఈ - క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ సమీపంలోని పొలాల్లో ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకుంటే వర్షాలు, ఇతర కారణాల వల్ల నష్ట పరిహారం వస్తుందని చెప్పారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, సబ్సిడీలు పొందవచ్చునన్నారు. సబ్ కలెక్టర్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్, ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వో షేక్షావలి, వ్యవసాయ సహాయకులు వాజిద్ తదితరులు ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

గోనెగండ్ల : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత వరకు పంట నమోదు, ఈ-కేవైసీ పూర్తయ్యిందని వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని, పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకుంటేనే ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగితే పరిహారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఏఓ హేమలత, తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదును పకడ్బందీగా చేపట్టాలి

పెద్దకడబూరు : మండలంలో వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దారు శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని నౌలేకల్లు, పెద్దకడబూరు గ్రామాలలో పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం వారు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకోవడానికి ఈనెల 9వ తేదీ చివరి రోజు కావున త్వరపడాలన్నారు. ఇప్పటికే మండలంలో 96శాతం ఈకేవైసీ పూర్తి అయ్యిందన్నారు. దీంతో పాటు శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రం సిబ్బందిని కలిస్తే రిజిస్ట్రేషన్ చేసుకుంటారన్నారు.

మానసిక సంఘర్షణకు గురి కావొద్దు



టెలీ మానస్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ, డీఎస్పీ, అధికారులు

ఆదోని సెంట్రల్: మానసిక సంఘర్షణకు గురి కాకుండా విధులను నిర్వర్తించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎల్. భాస్కర్ సూచించారు. మంగళవారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఒత్తిడి, మానసిక పరిస్థితులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎప్పుడూ ఒంటరిగా ఉండటం మంచిది కాదన్నారు. చికాకు, నిరాశ, నిస్పృహ వంటి లక్షణాలు ఉంటే మనం ప్రాథమిక దశలో ఉన్నామని గుర్తించుకోవాలన్నారు. చాలమంది మానసిక సంఘర్షణకు గురవుతున్నా చికిత్స తీసుకోవడం లేదన్నారు. దీంతో కొన్ని ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే మానసిక సమస్యల పరిష్కారానికి 'టెలీ మానస్' ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒత్తిడి, మానసిక సమస్యలు, భయందోళనలు ఇతర సమస్యలు ఉన్న వారు టెలీ మానస్ టోల్ ఫ్రీ నెంబర్. 14416కి ఫోన్ చేయాలని సూచించారు. ఇక్కడ సుశిక్షితులైన కౌన్సిలర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమములో డీఎస్పీ సోమన్న, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీనివాస నాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా. సత్యవతి జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమ వైద్యాధికారి డా. చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల తనిఖీ

పట్టణంలో ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్న మధు, వంశీ చైతన్య ఆసుపత్రులలోని వైద్య సేవలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. భాస్కర్ తనిఖీ చేశారు. వైద్య సేవలకు సంబంధించిన రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ చిన్న పిల్లల ఆసుపత్రిని కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో చిన్న పిల్లల ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. మాధవీలత. డీసీహెచ్ఎస్ డా.మాధవి, డా.ఎన్‌టీఆర్ వైద్య సేవ డిస్ట్రిక్ కో ఆర్డి నేటర్ డా. భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.